## క్లుప్తంగా

### మాడుగులలో 2 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

మాడుగుల: వచ్చే నెల 13వ తేదీన నిర్వహించనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మాడుగుల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దారు పీవీ రత్నం తెలిపారు. ఈ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించి, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### మహిళా పోలీసు జిల్లా అధ్యక్షురాలికి ఘన సన్మానం



కుసుమను సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

మాడుగుల రూరల్: గ్రామ/వార్డు సచివాలయాల మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన కె.జె.పురం -1వ సచివాలయం మహిళా పోలీసు అధికారి జి. కుసుమను గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పెంకి శివ ఆధ్వర్యంలో ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. ఈ నెల 22న గుంటూరులో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా కుసుమ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థలో మహిళా పోలీసులు గ్రామ స్థాయిలో శాంతి భద్రతలు కాపాడటంతోపాటు దిశ చట్టం అమలు చేస్తున్నామన్నారు. వీఆర్వో కాళింగ రామునాయుడు, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎ.భీమవరంలో 119 మందికి వైద్య సేవలు



ఎ.భీమవరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ధరణి

కె.కోటపాడు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో రోగుల ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారి ధరణి తెలిపారు. గురువారం ఎ.భీమవరంలో 119 మందికి ఓ.పి ద్వారా వైద్యంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్లకు వెళ్లి 13 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మూర్తి, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్‌ఎం దేవి, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

### కంచుగుమలలో 104 సంచార వైద్య సేవలు



104 సేవలపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

రోలుగుంట: ప్రభుత్వ ఆదేశాల మేరకు 104 వాహనం ద్వారా మారుమూల గ్రామాల్లో సైతం సంచార వైద్య సేవలు అందిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం కంచుగుమల ప్రధాన కూడలిలో రోగులను వైద్యురాలు రమణి పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంతోపాటు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. గర్భిణులను పరీక్షించి పలు సూచనలు చేశారు.

### ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

గొలుగొండ: పప్పుశెట్టిపాలెంలో తలుపులమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇక్కడ అమ్మవారి స్థలంలో ఇంజినీరింగ్ అధికారులు ప్లానింగ్ ఇచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి మంజూరైన రూ.10 లక్షలతో ఆలయం నిర్మించనున్నారు. త్వరలో గుడి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తామని సర్పంచ్ మాకిరెడ్డి విజయలక్ష్మి, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు రామకృష్ణనాయుడు తెలిపారు. పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మామిడి, జీడి రైతుల దిగాలు

- వేలాది ఎకరాల్లో రాలిపోతున్న పిందె
- నష్టాల పాలవుతున్న వైనం

చోడవరం: జీడి, మామిడి పంటలకు ఐదేళ్లుగా నష్టాలు వాటిల్లుతుండగా, ఈ ఏడాదీ ఉష్ణోగ్రతలు బాగా పడిపోవడం, మంచు కురవడంతో ఈ పంటలకు తేరుకోలేని దెబ్బతగిలింది. తొలుత మంచు దెబ్బకు పూత మాడిపోగా, ఇప్పుడు పిందెలు రాలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో మామిడి, జీడిమామిడి తోటలు ఉన్నాయి. ఈ పంటలపై ఏటా 60 కోట్ల నుంచి రూ.80 కోట్ల మేర వ్యాపారం సాగుతోంది. డిసెంబరు నుంచి పూత ప్రారంభమైన జీడి, మామిడి పంటలకు 15 రోజుల వరకు ఉష్ణోగ్రతలు బాగానే అనుకూలించాయి. మంచు కొద్దిగానే కురవడంతో పూత ప్రారంభంలో ఉష్ణోగ్రతల వల్ల ఎటువంటి ఇబ్బంది లేకపోవడంతో తోటలన్నీ పూతతో కళకళలాడాయి. ఈ నెల ప్రారంభం నుంచి వాతావరణంలో భారీ మార్పులు ఏర్పడి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. మైదాన ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా పడిపోయాయి. దీంతో సాయంత్రం నుంచి ఉదయం వరకు మంచు విపరీతంగా కురుస్తోంది. 30 శాతానికి పైగా పూత, ప్రాథమిక దశలో పిందె ఇప్పటికే రాలిపోయింది. ఇదే పరిస్థితి మరిన్ని రోజులు కొనసాగితే మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాలతోపాటు పాడేరు, అరకు గిరిజన ప్రాంతాల్లోనూ ఈ ఏడాది అదనంగా పది వేల ఎకరాల్లో జీడి, మామిడి హైబ్రీడ్ తోటలు సాగులోకి వచ్చాయి. 2014 హుద్‌హుద్ తుఫాన్‌కు తీవ్రంగా ఈ తోటలు దెబ్బతిన్నాయి. వాటి స్థానే వేసిన హైబ్రీడ్ తోటలు ఈ ఏడాది పూతకు వచ్చాయి. ఇప్పుడు పూతను కాపాడుకోవడానికి రైతులు పలు రకాల మందులు పిచికారీ చేస్తున్నా ఫలితం మాత్రం స్వల్పంగానే ఉంది.



మంచుకు మాడిపోయిన మామిడి పూత



పూత రాలిపోయిన జీడిమామిడి చెట్టు

### పూత చాలా దెబ్బతింది



నేను ఐదెకరాల మామిడి తోట కౌలుకు తీసుకున్నాను. రూ.2 లక్షల వరకు ఈ తోటపై పెట్టుబడి పెట్టాను. పూత మొదటి దశలో చాలా బాగుంది. ఈ సారి బాగా కాపు వస్తుందనుకున్నాను. ఈ మధ్య రోజుల్లో మంచు చాలా ఎక్కువగా పడుతుండటంతో చాలా మేర పూత మాడిపోయి రాలిపోయింది. పెట్టుబడి వచ్చేలా లేదు. ప్రభుత్వం రాయితీపై మందులు అందిస్తే కొంత ఆదుకున్నట్టు అవుతుంది.

– దేముడునాయుడు, మామిడి రైతు

### మంచు, పురుగుల ప్రభావం

తేనె మంచు, పురుగులు ప్రభావం చూపడంతో పూత దెబ్బతింటుంది. జీడి, మామిడి తోటలకు పోషకాలు వేయాలి. 13045 ఎరువును పూతకు పిచికారీ చేస్తే ఆ నష్టం నుంచి రక్షించుకోవచ్చు. ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీలీటరు, లేదా ఫిప్రోనిల్ 2మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

– గణేష్, ఉద్యానవనశాఖ అధికారి

## మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న టౌన్ సీఐ గణేష్

నర్సీపట్నం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టౌన్ సీఐ ఎన్.గణేష్ పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాలపై పెదబొడ్డేపల్లి డాన్ బాస్కో కళాశాల, పోలీసు శాఖ సౌజన్యంతో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు శ్లోకాల ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. డ్రగ్స్‌కు బానిస అవటం వల్ల కలిగే అనర్థాలను చిన్న చిన్న స్కిట్లు, పాటల రూపంలో కళ్లకు కట్టినట్టు వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం మత్తు పదార్థాల నివారణకు అనేక చర్యలు చేపడుతుందన్నారు. దీనికి ప్రజలు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదువు కోసం కళాశాలలకు పంపిస్తే పలువురు విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలై వారి ఆశయాలను అడియాశలు చేస్తున్నారని వాపోయారు. కళాశాల ప్రిన్సిపాల్ బెన్ని ఫాదర్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.71 లక్షలతో ఇంటింటా కుళాయిల ఏర్పాటు

- ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్



గుమ్మడిగొండలో ట్యాంకు నిర్మాణ పనులు

నాతవరం: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్ తెలిపారు. గుమ్మడిగొండ పంచాయతీలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు జల్‌జీవన్ మిషన్ పథకం నుంచి రూ. 71 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో చేపడుతున్న 45 వేల లీటర్ల సామర్థ్యం ట్యాంకు నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో రూ. 5 కోట్లతో జల్ జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. చిక్కుడుపాలెం వద్ద తాండవ నదిలో పైలట్ ప్రాజెక్టు ద్వారా 16 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ వర్కు ఇన్‌స్పెక్టరు రామకృష్ణ ఉన్నారు.

## వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



రమేష్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా సోలం రమేష్‌ను నియమించారు. ఈయన ప్రస్తుతం శంకరం గ్రామ సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు. గురువారం దేవరాపల్లి మండలం తారువ క్యాంపు కార్యాలయంలో సోలం రమేష్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూలమాలతో సన్మానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

## విద్యా ఉపకరణాల పంపిణీ



విద్యా ఉపకరణాలు అందిస్తున్న సొసైటీ సభ్యులు

రావికమతం: ప్రామిస్డ్ ల్యాండ్ విమెన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజన పంచాయతీ చీమలపాడు శివారు గిరిజన గ్రామాల్లో 580 మంది పిల్లలకు రూ.20 వేల విలువ చేసే విద్యా ఉపకరణాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి అశోక్, సభ్యులు రమణ, కుమార్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు తమ సంస్థ ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అనంతరం వైద్యులు చిన్నారులను పరీక్షించారు.

## మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలికి అభినందనలు



అనురాధకు పుష్పగుచ్ఛం అందిస్తున్న శివాజీరాజు, తదితరులు

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన ఈర్లె అనురాధకు పలువురు అభినందనలు తెలుపుతున్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, ఆకుల సాయి ప్రసాద్, చల్లా సురేష్, పి.ఎం.నాయుడు గురువారం ఆమె కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

**సీఎం జగన్‌కు కృతజ్ఞతలు..**

బీసీ వర్గానికి చెందిన తనకు పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అనురాధ కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి మహిళలకు అన్ని రంగాల్లోనూ సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

**జిల్లా అధ్యక్షురాలిగా అనురాధ ఎంపికపై హర్షం**

చీడికాడ: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఈర్లె అనురాధ ఎంపికపై ఎంపీపీ కురచా జయమ్మ, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు హర్షం వ్యక్తం చేశారు. గురువారం అనురాధను మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు లాలం జానకీరాం, ధర్మిశెట్టి కొండబాబు, జేబిపురం సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పిలుపు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం దేవరాపల్లిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికను పార్టీ శ్రేణులంతా ప్రతిష్టాత్మకంగా తీసుకుని, ప్రతీ ఓటరును ప్రత్యేకంగా కలిసి ఓటు వేసేలా అభ్యర్థించాలన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న విప్లవాత్మక పాలనను, ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించి మాడుగుల నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు.

**26న కె.కోటపాడులో సమావేశాన్ని విజయవంతం చేయండి...**

కె.కోటపాడులో ఈ నెల 26న జరిగే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు సూచించారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, యువజన విభాగం మండలాధ్యక్షుడు కర్రి సూరినాయుడు, మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ పాల్గొన్నారు.

## దుకాణాలు తొలగిస్తే రోడ్డున పడతాం



నోటీసులు అందుకున్న దుకాణదారులు

మాకవరపాలెం: దుకాణాలు తొలగిస్తే రోడ్డున పడతామని జి.కోడూరు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ కొందరు గెడ్డ భూమిలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఏడాదికిపైగా జీవనం సాగిస్తున్నారు. ఇటీవల స్థానికుల ఫిర్యాదుతో దుకాణాలు తొలగించాలని ఇరిగేషన్ అధికారులు నాలుగు రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. దీంతో దుకాణదారులు గురువారం మాట్లాడుతూ తమ దుకాణాల తొలగింపును నిలుపుదల చేయాలని కోరారు. వీటిని తొలగిస్తే బతుకు దెరువు కోల్పోతామన్నారు. ఈ విషయంలో పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజును గెలిపించాలి



పట్టభద్రులను కోరుతున్న జెడ్పీటీసీ గిరిబాబు

గొలుగొండ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ని గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు కోరారు. చీడిగుమ్మల గ్రామంలో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రులతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## ఉత్సాహంగా ఫేర్‌వెల్



మాట్లాడుతున్న హెచ్‌ఎం రమణ

రోలుగుంట: పాఠశాలల్లో ఫేర్‌వెల్ కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని హెచ్‌ఎం బి.వి.రమణ తెలిపారు. కొంతలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు పలు దేశ నాయకుల ఏకపాత్రాభినయం ప్రదర్శనలు, సాంఘిక, జానపద నృత్యాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. పాఠశాలలో చక్కని వాతావరణం ఏర్పాటుతో నాణ్యమైన విద్యా బోధనతో విద్యార్థుల ఉన్నతి కోసం ఉపాధ్యాయులతో సమష్టి కృషి చేసిన హెచ్‌ఎంను వారంతా శాలువాతో సన్మానించారు.

# రోడ్డు తవ్వి వదిలేయడంతో ప్రమాదాలు



చెర్లోపాలెం సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు గొయ్యి

నాతవరం: రోడ్డు మార్జిన్‌లో గొయ్యితో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చెర్లోపాలెం బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి ఆలయం మధ్య ఆర్ అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా కేబుల్ వైర్లు ఏర్పాటు చేసేందుకు గొయ్యిలు తీశారు. ఆ తర్వాత రోడ్డు మార్జిన్‌లో అయిదడుగుల లోతులో గొయ్యి కప్పకుండా వదిలేశారు. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు ఏమాత్రం ఆదమరిచిన ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిళ్లు కొత్తగా వచ్చే వాహనదారులు అందులో పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. కొత్త అమావాస్యకు జిల్లేడుపూడి నూకాలమ్మ తల్లి పండగకు కోటవురట్ల, నర్సీపట్నం, నాతవరం మండలాల నుంచి ప్రజలు ఈ రోడ్డు పైనే వస్తారు. ఈ నేపథ్యంలో ప్రమాదకర గొయ్యిపై హెచ్చరిక బోర్డులు గానీ లేదా కప్పేయాలని వాహనచోదకులు కోరుతున్నారు. అదేవిధంగా డి.యర్రవరం నుంచి నూకాలమ్మ గుడికి వచ్చే ఆర్ అండ్‌బీ రోడ్డు మార్జిన్లు పలు చోట్ల కోతకు గురై ప్రమాదాన్ని తలపిస్తున్నాయి.

## ఘనంగా షిర్డీ సాయి మందిర వార్షికోత్సవం



దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: తట్టబందలో షిర్డీసాయి మందిర వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. గ్రామంతోపాటు పలు గ్రామాల రైతులు, వ్యాపారులు తరలివచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ విద్యుద్ అలంకరణతోపాటు భారీ సెట్టింగులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ గోకివాడ రమణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బుచ్చెయ్యపేట: వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండబోదని ఏఈ రాజు తెలిపారు. విజయరామరాజుపేట నుంచి వడ్డాది మీదుగా కొమళ్లపూడి వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు.

## పత్రికా విలువలు పతనం

బుచ్చెయ్యపేట: పట్టాభిని కొట్టారని పాత ఫొటోలతో తప్పుడు వార్త ప్రచురించిన ఈనాడు పత్రికా విలువలను దిగజార్చిందని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు తదితరులు విమర్శించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడి మీద అతి ప్రేమ చూపుతున్న రామోజీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి తన సత్తా చూపించుకుంటే బాగుంటుందని హితువు పలికారు.

## ఘనంగా కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరుని కల్యాణం

మునగపాక: మెయిన్‌రోడ్డులోని లింగరాయిగుడిలో గురువారం కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితులు సోమశేఖర్ నేతృత్వంలో కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, కోశాధికారి వేగి సాయిబునాయుడు తగు చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పెంటకోట జగన్నాథం, పెంటకోట సూర్యనారాయణ, కిరణ్, భీశెట్టి వెంకట్, ఆదారి అచ్చియ్యనాయుడు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# పందుల దాడిలో ఆవుదూడకు గాయాలు

పరవాడ: మంత్రిపాలెంలో ఊర పందుల బీభత్సంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాలనీల్లో విచ్చల విడిగా సంచరిస్తూ దాడులు చేస్తున్నాయని రైతు లు వాపోతున్నారు. గతంలో ఊర పందుల దాడిలో లేగ దూడలు ప్రాణాలు కోల్పోగా మళ్లీ గురువారం కళ్లంలో కట్టిన ఓ లేగదూడపై పందులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయని వాపోయారు. పందుల కారణంగా పిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచ్చల విడిగా మూగ జీవాలపై దాడులకు పాల్పడుతున్న పందులను నివారించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వేసవిలో హాయిగా..

- చురుగ్గా విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు



పి.బోనంగి విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పరవాడ: వేసవిలో కూడా నాణ్యమైన విద్యుత్ అందించడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. విద్యుత్ వినియోగం పెరగనున్న దృష్ట్యా అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు నిర్వహణ సామర్థ్యంపై దృష్టిసారించారు. దీని కోసం విడతల వారీగా పనులు చేపడుతున్నారు. ఆయా ఫీడర్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్‌తో పాటు అవసరమైన చోట నూతన పరికరాలు అమర్చుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, లైన్లలో ఉన్న చిన్నచిన్న మరమ్మతులు పూర్తి చేస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలో పి.బోనంగి గ్రామంలో గురువారం నిర్వహణ పనులు చేపట్టారు. ఎనీపీసీ ఫ్లైయాష్ కారణంగా వైర్లు తుప్పు పట్టి తరచూ విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ , జెడ్పీటీసీ పి.ఎస్.రాజు సమస్యను ఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సిబ్బంది తుప్పు పట్టిన విద్యుత్ వైర్లు మార్చి కొత్తవి ఏర్పాటు చేశారు. విద్యుత్ స్తంభాలపై దెబ్బ తిన్న కేశారాలను తొలగించి నూతన కేశారాలు, పిన్నులు ఏర్పాటు చేశారు. విద్యుత్ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేసిన జెడ్పీటీసీ పి.ఎస్.రాజుకు సర్పంచ్ కల్పన రాజశేఖర్, మాజీ ఎంపీటీసీ దెక్క శ్రీనివాసరావు ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వ్యక్తి

కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామం వైపు మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. వెదురుపర్తికి చెందిన ఆళ్ల రమణ కశింకోట నుంచి మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడి నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

## బీజేపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించండి



కరపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

మాడుగుల రూరల్: బీజేపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల సిట్టింగ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.వి.ఎస్. మాధవ్‌కు ఓటు వేసి గెలిపించాలని స్థానిక పార్టీ నాయకులు కోరారు. గురువారం కె.జె.పురంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుట్టా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు సాలాపు వీరునాయుడు పట్టభద్రుల ఓటర్లను కలిసి అభ్యర్థించారు. రెండో సారి మాధవ్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు.